# వర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దు

- వర్సిటీ ప్రధాన గేటు వద్ద బైఠాయింపు
- సెలవులోనూ అగ్రి విద్యార్థుల నిరసన

వియ్ వాంట్ జస్టిస్

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 16: వ్యవసాయ వర్సిటీ భూములను హైకోర్టు నిర్మాణం కోసం ఇవ్వొద్దని వర్సిటీ విద్యార్థులు డిమాండ్ చేశారు. జీవో 55ను రద్దు చేసేవరకు ఆందోళన ఆపబోమని తేల్చిచెప్పారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు సంక్రాంతి పండుగ రోజుల్లో కూడా నిరసన తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఉదయం నుంచే వర్సిటీ ప్రధాన గేటు వద్ద వ్యవసాయ కళాశాల యూజీ , పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు బైఠాయించారు. భోగి మంటలు వేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల, గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ మనస్సు మార్చాలని కోరారు. సీఎం, గవర్నర్‌కు ట్విట్టర్‌లో వ్యవసాయ వర్సిటీ నాడు, నేడు, భవిష్యత్ ప్రణాళికను పంపించారు. స్థానిక పోలీసులు పండుగ పూట నిరసన ఎందుకని విద్యార్థులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ.. 'మా లక్ష్యం నెరవేరే వరకు శాంతియుతంగా ఉద్యమాలు చేస్తాం' విద్యార్థులు స్పష్టంచేశారు. సేవ్ ద యూనివర్సిటీ ల్యాండ్స్, సేవ్ ఫార్మర్స్, స్టూడెంట్ ఫవర్ నేషనల్ పవర్.. అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. వర్సిటీ కళాశాల విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, అరవింద్, మధుకర్, సత్యమూర్తి, సురేందర్, దీక్షిత్, భానుచందర్, హరిప్రియ, శిరీష, అరవింద్, వంశీ చందర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, శంకర్‌నాయక్, రాకేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులు వర్సిటీ ప్రధాన కార్యాలయం గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు.



బోగి మంటలతో, దర్నాలో విద్యార్థుల నిరసన

# బడ్జెట్ కూర్పుపై ఆర్థికశాఖ కసరత్తు

- 18 నుంచి శాఖలవారీగా సమీక్షలు

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్ కూర్పుపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. రేపటి నుంచి అన్ని శాఖలతో సమావేశాలు నిర్వహించాలని ఆర్థికశాఖ నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే పలు శాఖలు ప్రభుత్వ ప్రాధాన్యానికి అనుగుణంగా ప్రతిపాదనలు పంపాయి. ఆయా శాఖలన్నీ తమ ప్రతిపాదనల్లో ఆరు గ్యారంటీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిసింది. రోజుకు ఇద్దరు మంత్రులు, సంబంధిత శాఖలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశాలు నిర్వహిస్తారు. లోక్‌సభ ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న తరుణంలో, రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్‌కు వెళ్తుందా లేదంటే పూర్తిబడ్జెట్‌ను ప్రవేశపెడుతుందా? అన్న విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.






# మల్లేశ్ హత్యపై న్యాయవిచారణ జరిపించాలి

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్
- జూపల్లి ప్రమేయం లేకుంటే ఎందుకు పరామర్శించలేదని ప్రశ్న



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు బీరం, గువ్వల

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ నేత, మాజీ సైనికుడు మల్లేశ్ హత్యపై న్యాయ విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణభవన్‌లో మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గువ్వల బాలరాజుతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో జరిగిన ఈ హత్యలో మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరుల ప్రమేయం లేకుంటే వారి కుటుంబాన్ని ఆయన ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. రాజకీయ కారణాలతోనే మల్లేశ్‌ను హత్య చేశారని, న్యాయవిచారణ జరిపిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హత్యా రాజకీయాలకు తెరలేపిందని, ఇవి ఇంతటితో ఆగేలా లేవని గువ్వల బాలరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఓ మంత్రిగా హత్యా రాజకీయాలను జూపల్లి నియంత్రించాలని మాత్రమే కేటీఆర్ అన్నారని, జూపల్లిపై ఎలాంటి ఆరోపణలు చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ ఇలానే వ్యవహరిస్తే ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## భూతగాదాల వల్లే మల్లేశ్ హత్య: జూపల్లి



హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): నాగర్‌కర్నూలు జిల్లా గంట్రావుపల్లిలో డిసెంబర్ 29న జరిగిన చిక్కేపల్లి మల్లేశ్ హత్య కుటుంబ, భూతగాదాల వల్లే జరిగిందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సోమవారం ఆయన సెక్రటేరియట్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ హత్యను బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయంగా వాడుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మల్లేశ్ కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఈ హత్యను తాము కూడా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మల్లేశ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.






# పులుల మృతిపై సీసీఎంబీ అధ్యయనం

**మీట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చేరిన నమూనాలు**

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ అడవుల్లో మరణించిన పులుల నమూనాలు హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) మీట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చేరుకున్నాయి. ఒకే నెలలో రెండు పులులు మృతిచెందడంపై సమగ్ర అధ్యయనం కోసం వాటి నుంచి సేకరించిన వెంట్రుకలు, రక్తం, మాంసం నమూనాలను సీసీఎంబీకి అందజేశారు. గతంలో హిమచల్‌ప్రదేశ్, కశ్మీర్‌లోని కొన్ని జంతువులపై అధ్యయనం చేసిన సీసీఎంబీ.. ఇప్పుడు పులుల మరణంపై శాస్త్రీయ అధ్యయనం జరుపనున్నది. ఈ అధ్యయనం పూర్తయ్యేందుకు రెండు వారాల సమయం పడుతుందని, ఆ తర్వాత అటవీ శాఖాధికారులకు నివేదికను అందజేస్తామని సీసీఎంబీ వర్గాలు వెల్లడించాయి. కాగజ్‌నగర్‌లోని దరిగాం అటవీ ప్రాంతంలో ఈ నెల 6న రెండు పులుల మధ్య జరిగిన కొట్లాటలో ఓ పులి చనిపోయినట్టు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 8న ఆసిఫాబాద్ అటవీ ప్రాంతంలో మరో పులి చనిపోవడంతో వాటి నమూనాలను సేకరించారు. ఆసిఫాబాద్ పులి మరణానికి విషప్రయోగమే కారణమని ప్రాథమికంగా తేల్చారు.

### అటవీశాఖ అధికారుల సస్పెన్షన్

కాగజ్‌నగర్, జనవరి 16: దరిగాం అడవుల్లో పులుల మృతి ఘటనలో నలుగురు అటవీ అధికారులపై వేటు పడింది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని ఎఫ్‌డీవో వేణుబాబు, ఎఫ్‌ఆర్వో వేణుగోపాల్, ఎఫ్‌ఎస్‌వో పోశెట్టి, బీట్ అధికారి శ్రీకాంత్‌ను మంగళవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


